చలివేంద్రాలను ఏర్పాటు చేయాలి

అత్తాపూర్, మార్చి27:చలి వేంద్రాల ఏర్పాటుకు రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలని అత్తాపూర్ డివిజన్ ప్రజలు కోరుతున్నారు. డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఎండల కారణంగా వాహనదారులు, పాదచారులు, కూలీలు తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నారు. మార్చి నెలలోనే ఇంతలా ఉంటే ఏప్రిల్, మే మాసంలో పరిస్థితి ఘోరంగా ఉంటుందని, బయటకు రాలేని పరిస్థితి ఏర్పడుతుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డివిజన్ పరిధిలోని నందిముస్లాయిగూ, అత్తాపూర్, రాంబాగ్, హైదర్‌గూడ, కాలహనుమాన్ చౌరస్తా లాంటి ప్రాంతాల్లో ఎక్కువగా దినసరి కూలీలు, తోపుడు బండ్ల వ్యాపారులు తమ పనులు చేసుకుంటారు. ఈ ప్రాంతాల్లో జీహెచ్ఎంసీ అధికారులు చలి వేంద్రాలను ఏర్పాటు చేయాలని కార్మికులు కోరుతున్నారు. దాంతో పాటు రూ.5 భోజనం అందించే కేంద్రాల పక్కన కూడా చలి వేంద్రాలను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. చల్లటి నీళ్లను అందించే చలివేంద్రాలను అధికారులు ఏర్పాటు చేస్తే తమ సహకారం అందిస్తామని స్థానిక రాజకీయ నాయకులు చెబుతున్నారు.

ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలి

హిమాయత్‌నగర్, మార్చి 27 : నగరంలో బస్తీలు, మురికివాడలలో నివాసం ఉండే పేద ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు మౌలిక వసతులు కల్పించాలని సీపీఐ నగర కార్యదర్శి ఎస్.ఛాయదేవి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం హిమాయత్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. వేసవిలో తాగునీటి సమస్యతో పేదలు అవస్థలు పడుతున్నారని, పాడైన బోర్ మోటర్లకు మరమ్మతులు చేసి తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని, పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

రెట్టింపు ఉత్సాహంలో రాజేంద్రనగర్ క్యాడర్

- ఎంపీ ఎన్నికల్లో మెజార్టీయే లక్ష్యంగా పనిచేస్తామంటూ ధీమా
- విశ్వాసం లేని వారికి ఓటుతో సమాధానం చెప్పాలంటూ సిద్ధమైన బీఆర్ఎస్ క్యాడర్
- చెక్కుచెదరని గులాబీ క్షేత్రస్థాయి బలం
- కేసీఆర్ సంక్షేమ పథకాలే.. బాగున్నాయంటున్న ప్రజలు

మణికొండ, మార్చి 27 : అసెంబ్లీ ఎన్నికల తర్వాత చేవెళ్ల పార్లమెంటు సెగ్మెంట్ పరిధిలోని రాజేంద్రనగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ మరింత ఉత్సాహంగా అడుగులు వేస్తున్నది. క్షేత్రస్థాయి నుంచి క్యాడర్ సీరియస్‌గా ఎన్నికల వ్యూహాన్ని అమలు చేసేందుకు సిద్ధమైంది. గత ఎన్నికలతో పోల్చితే ఈసారి నియోజకవర్గం నుంచి రెట్టింపు మెజార్టీని బీఆర్ఎస్ పార్టీ బలపర్చిన అభ్యర్థికి అందించేందుకు

వ్యూహాలకు సన్నద్ధమవుతున్నది. మంగళవారం నార్సింగిలోని ఓం కన్వెన్షన్‌లో జరిగిన ముఖ్య నాయకుల సమావేశం విజయవంతంగా ముగియడంతో క్యాడర్‌లో నూతనోత్సాహం కన్పించింది. మొన్నటి వరకు చాలా నేతలు పార్టీ మారే యోచనలో ఉన్నారన్న ఊహాగానాలకు ఈ సమావేశంతో తెరదింపారు. సీన్ కట్ చేస్తే ఏకంగా స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ క్యాడర్‌పై పూర్తిస్థాయి నమ్మకం ఉందని, ఎవరైనా పార్టీ మారాలనుకుంటే మారండి కానీ డ్రామాలాడొద్దంటూ సుతిమెత్తగా సూచనలు చేశారు. మనకు ఆత్మవిశ్వాసం ఉంది.. విశ్వాసం లేని వారే పార్టీ మారుతారంటూ క్యాడర్‌లో నమ్మకాన్ని నింపే ప్రయత్నం చేశారు. లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో రాజేంద్రనగర్‌లో ఎమ్మెల్యేకు వచ్చిన మెజార్టీని రెట్టింపుగా ఎంపీ అభ్యర్థికి అందిస్తామని ప్రతి ఒక్కరూ ప్రతీనబూనాలని పిలుపునిచ్చారు. కచ్చితంగా చేవెళ్ల ఎంపీ స్థానాన్ని మరోసారి బీఆర్ఎస్ కైవసం చేసుకోవడం ఖాయమంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు.

టికెట్ పొందడంపై గుర్రుగా క్యాడర్

చేవెళ్ల పార్లమెంటు బీఆర్ఎస్ పార్టీ సిట్టింగ్ ఎంపీగా ఉన్న గడ్డం రంజిత్‌రెడ్డి అనూహ్యంగా కాంగ్రెస్ పార్టీలో చేరడంతో ఆ పార్టీలో అంతర్గత విభేదాలు తారాస్థాయికి చేరుకున్నట్లు తెలుస్తున్నది. పదేళ్లుగా కాంగ్రెస్ పార్టీ జెండా పట్టుకుని సేవలందిస్తున్న క్యాడర్‌ను పట్టించుకోకుండా అలా పార్టీలోకి వచ్చి ఇలా టికెట్ ఎగురేసుకుపోవడంపై క్షేత్రస్థాయి నుంచి ఆయనపై వ్యతిరేకత ప్రారంభమైంది. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో జరిగిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కేపీఆర్ ఏకంగా సీఎం ముందే అలా వచ్చిన వారికి టికెటు ఇస్తే నాలాంటోళ్లంతా చచ్చిపోతారంటూ ఆవేదన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే.

బీజేపీలో సభ్యత కరువు...

చేవెళ్ల పార్లమెంటు బీజేపీ అభ్యర్థిగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని ప్రకటించినా ఆ పార్టీలో సీనియర్లు, జూనియర్ల మధ్య ఏ గ్రామంలోనూ సఖ్యత లేకపోవడం గమనార్హం.

చెక్కుచెదరని బీఆర్ఎస్ క్యాడర్

రాజేంద్రనగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ క్యాడర్ చెక్కుచెదరలేదని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ధీమాగా ఉన్నారు. ఎంపీ రంజిత్‌రెడ్డి పార్టీ మారినా ఏ ఒక్క కార్యకర్త పార్టీ మారలేదన్నారు. ఎవరైనా పార్టీ మారాలనుకుంటే ఎన్నికలకు ముందే వెళ్లొచ్చని.. డ్రామాలొద్దంటూ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ కొంతమంది నాయకులకు సూచించారు. దీంతో ఇక బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎవరూ పార్టీ మారే అవకాశాలు లేవని అర్థమైందని పార్టీ సీనియర్లు అంటున్నారు. ఎన్నికల్లో నియోజకవర్గం నుంచి అధిక మెజార్టీని బీఆర్ఎస్‌కు అందించేందుకు పనిచేయడం ఖాయమని కార్యకర్తలు, నాయకులు ధీమా వ్యక్తం చేస్తుండటం విశేషం.

ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలి

మణికొండ మున్సిపల్ కార్యాలయంలో సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

మణికొండ, మార్చి 27: వేసవిలో ప్రజలకు నీటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ తెలిపారు. మణికొండ మున్సిపల్ కార్యాలయంలో బుధవారం మున్సిపల్ అధికారులు, జలమండలి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. తాగునీటి సరఫరా తదితర వాటిపై అధికారులు, సిబ్బందికి సలహాలు, సూచనలు చేశారు. అనంతరం నాగులమ్మ దేవాలయం వద్ద వాటర్ ట్యాంకర్ ఫిల్లింగ్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పించడంలో అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలన్నారు. తాగునీటి సరఫరాలో ఎలాంటి లోటుపాట్లు రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలకు నీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి నీటి వృథా కాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డి.ప్రదీప్‌కుమార్, డీఈ దివ్యజ్యోతి, జీఎం రవీందర్‌రెడ్డి, డీజీఎం శ్రీనారాయణ, మేనేజర్ సూర్యతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్, ప్రైవేట్ కాలేజీలపై చర్యలు తీసుకోవాలి

ఇంటర్ విద్యామండలి కార్యదర్శి శృతిఓజాకు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

హిమాయత్‌నగర్, మార్చి 27: ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ముందస్తుగా అడ్మిషన్లు తీసుకునే ప్రైవేట్, కార్పొరేట్ జూనియర్ కాలేజీలపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర ఇంటర్ విద్యామండలి కార్యదర్శి శృతిఓజాకు బుధవారం ఏఐఎస్ఎఫ్ ప్రతినిధి బృందం వినతి పత్రాన్ని అందజేసింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేశ్ మాట్లాడుతూ.. వచ్చే విద్యాసంవత్సరానికి అక్రమంగా అడ్మిషన్లను తీసుకునేందుకు పలు రకాల ఆఫర్ల పేరుతో తల్లిదండ్రులను ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల యజమానులు మభ్యపెడుతున్నారని ఆరోపించారు. ఇంటర్ పరీక్షలు ముగిసినప్పటికీ కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ జూనియర్ కాలేజీలు విద్యార్థులకు సెలవులు ఇవ్వకుండా తరగతులను నడుపుతున్నారని తెలిపారు. విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ, తనిఖీలు లేకపోవడంతోనే ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు చేసే ఆగడాలకు అదుపులేకుండా పోతుందన్నారు. ఈ విద్యాసంస్థలు చేసే ఫీజుల దోపిడీకి అడ్డుకట్టవేసి ముందస్తు అడ్మిషన్లు నిలిపివేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

పెండింగ్ స్కాలర్‌షిప్స్, ఫీజులు విడుదల చేయాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శంకర్

శంషాబాద్ రూరల్, మార్చి 27 : పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి బి.శంకర్ డిమాండ్ చేశారు. బుధవారం శంషాబాద్ పట్టణంలో ఎస్ఎఫ్ఐ రాజేంద్రనగర్ నియోజకవర్గ నాయకులు సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన కార్యదర్శి బి.శంకర్, అధ్యక్షుడు కే వై ప్రణయ్ మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడంతో విద్యార్థులను కళాశాలల యాజమాన్యాలు తీవ్రంగా వేధింపులకు గురి చేస్తున్నారని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే స్పందించి నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్ నూతన కమిటీ ఎన్నిక

ఎస్ఎఫ్ఐ రాజేంద్రనగర్ నియోజకవర్గ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ప్రసాద్‌చారి, కార్యదర్శిగా కౌశిక్, ఉపాధ్యక్షుడిగా సోహైల్, జయశ్రీ, అర్జున్, వెనుప్రకాశ్, సహాయ కార్యదర్శిగా వైష్ణవి, తరుణ్, రోహిత్, అనుష్క, కమిటీ సభ్యులుగా

శంషాబాద్ పట్టణంలో ఎస్ఎఫ్ఐ సమావేశంలో మాట్లాడుతున్న ఆ సంఘం జిల్లా కార్యదర్శి శంకర్, తదితరులు

శ్రీకాంత్, శివ, హర్ష, సాయిరాజ్, చరణ్, వంశీలను ఎన్నుకున్నట్లు తెలిపారు.

పీడీ యాక్ట్ పెట్టినా దొంగతనాలు మానలేదు

ఖైరతాబాద్, మార్చి 27 : పోలీసులు పీడీ యాక్ట్ పెట్టినా దొంగతనాలు మానలేదు. ముఠాగా ఏర్పడి సెల్‌ఫోన్లు, బంగారం దొంగతనాలు మొదలుపెట్టాడు. మరోసారి పోలీసులకు చిక్కి కటకటాలపాలయ్యాడు. పంజాగుట్ట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలానగర్ రాజుకాలనీకి చెందిన దూదాని సాగర్‌సింగ్(24) పాత నేరస్తుడు. బాలానగర్ సరబంద్‌నగర్‌కు చెందిన సాలామ్‌ఖాన్ (23), రాజు కాలనీకి చెందిన కొయాడ నవీన్‌కుమార్ (18)తో కలిసి ముఠాగా ఏర్పడి దొంగతనాలకు ఉపక్రమించారు.

గంజాయి, మద్యం, ఇతర మత్తు పదార్థాలను సేవిస్తూ దొంగతనాలకు పాల్పడ్డారు. ఈనెల 24న అర్ధరాత్రి ఎల్లారెడ్డిగూడలో స్కూటీపై ముగ్గురు వచ్చి ఓ మహిళా బ్యాగును అపహరించుకెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు ముగ్గురు నిందితులను పట్టుకొని వారి వద్ద నుంచి స్కూటీ, ఐదు సెల్‌ఫోన్లు, బంగారు చెవికమ్మలు, నగదును స్వాధీనం చేసుకున్నారు. దూదాని సాగర్‌సింగ్ 16 దొంగతనాల కేసుల్లో నిందితుడు కాగా, 2021లో బాలానగర్ పోలీసులు పీడీ యాక్ట్ పెట్టారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కేర్ టేకర్‌గా నటిస్తూ దొంగతనం

ఖైరతాబాద్, మార్చి 27: ఓ ఇంట్లో కేర్ టేకర్‌గా పనిచేస్తూ ఆ ఇంటికే కన్నం వేశాడు. ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా పుప్పాలగూడకు చెందిన చెట్టుపల్లి బిపిన్ ఉత్తమ్ ఉద్యోగం కోసం హైదరాబాద్‌కు వచ్చాడు. కొంతకాలం పలు హెల్త్‌కేర్ సర్వీసెస్‌లలో కేర్ టేకర్‌గా పనిచేసి మానేశాడు. తాజాగా సోమాజిగూడలో మంచానికే పరిమితమైన బాలకృష్ణ అనే వ్యక్తి ఇంట్లో కేర్ టేకర్‌గా చేరాడు. నమ్మకంగా నటిస్తూ ఇంట్లోని విలువైన వస్తువులపై కన్నేశాడు. బుధవారం కుటుంబసభ్యులు సూపర్ మార్కెట్‌కు వెళ్లగా, ఎవరు లేనిది చూసి ఇంట్లోని బంగారు ఆభరణాలు, నగదుతో ఉడాయించాడు. ఇంటికి వచ్చిన కుటుంబసభ్యులు ఆలస్యంగా గుర్తించారు. దొంగతనం చేసినట్లు గ్రహించి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

76 ఏండ్లు.. 146 స్కాములు

ఖైరతాబాద్,మార్చి 27: దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత గడిచిన 76 ఏండ్లలో వివిధ రాజకీయ పార్టీల ద్వారా 146స్కాములు, చీటింగ్స్ జరిగాయని అలిండియా బ్యాక్‌వర్డ్ పీపుల్ సునామీ పార్టీ జాతీయ అధ్యక్షుడు సీహెచ్.భూపాల్‌గౌడ్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశ సరిహద్దులో 24/7గంటలు సైనికులు చలి, ఎండ, మంచుగడ్డలో పహారా కాస్తుంటే వెలుపల ఉన్న రాజకీయ నాయకులు సొంత ప్రయోజనాలే లక్ష్యంగా దోచుకుంటున్నారని ఆరోపించారు. దేశంలో ఉన్నవన్నీ ఫేక్ ప్రభుత్వాలేనని, ఓట్లు కొనుక్కోవడం పదవులు చేపట్టడం ఆనవాయితీగా మారిందన్నారు. ప్రజల పక్షాన వారి హక్కులు, రాజకీయ పార్టీలు చేస్తున్న మోసాలపై అవగాహన కల్పిస్తామన్నారు.

జాస్మిన్ హైస్కూల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

రాజేంద్రనగర్‌లోని శ్రీజాస్మిన్ హైస్కూల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. 2011 నుంచి 2023 వరకు పాఠశాలలో విద్యనభ్యసించిన 12 బ్యాచ్‌ల విద్యార్థులు పాల్గొని తమ ఉన్నతికి ఉపాధ్యాయులు చేసిన కృషిని కొనియాడారు. పాఠశాల చైర్మన్ పి.జగన్నాథం, విజయలక్ష్మి, హెచ్ఎం విజయలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **-జూబ్లీహిల్స్, మార్చి 27**

ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలి

కాటేదాన్‌లో సీఎం రేవంత్‌రెడ్డికి సీఐటీయూ ఆధ్వర్యంలో రాసిన లేఖ కరపత్రాన్ని విడుదల చేస్తున్న నాయకులు

మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 27: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే పరిష్కరించి అన్ని రంగాల కార్మికులను ఆదుకోవాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎం.చంద్రమోహన్ అన్నారు. రంగారెడ్డి జిల్లా సీఐటీయూ కమిటీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డికి ఇచ్చిన వినతిపత్రాన్ని కరపత్రం రూపంలో బుధవారం విడుదల చేశారు. జిల్లా ఉపాధ్యక్షులు కీసరి నర్సిరెడ్డి అధ్యక్షతన సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కాటేదాన్ ఆఫీస్ బేరర్స్ సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎం.చంద్రమోహన్ హాజరై కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కార్మిక పాలసీని ప్రకటించాలని ప్రజా పాలనలో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డిని సీఐటీయూ కొత్తగా ప్రభుత్వం ఏర్పడగానే లేఖ అందించడం జరిగిందన్నారు. అధికారంలోకి వచ్చి 100 రోజులు అయినా రాష్ట్రంలో కార్మికులు, ఉద్యోగులు ఎరర్కొంటున్న సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు జాజాల రుద్రకుమార్, బిసా సాయిబాబు, అల్వాల రవికుమార్, జిల్లా సహాయ కార్యదర్శి స్వప్న తదితరులు పాల్గొన్నారు.

కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సతీమణి ప్రచారం

బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా బుధవారం శంషాబాద్ మండలంలోని ముచ్చింతల్ గ్రామంలో ఆయన సతీమణి సంగీతారెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో పార్టీ మండల అధ్యక్షుడు చిటికెల వెంకటయ్య, మాజీ సర్పంచ్ సుజాత, మాజీ ఎంపీటీసీ చంద్రయ్య, పార్టీ నాయకులు పాల్గొన్నారు. **- శంషాబాద్ రూరల్, మార్చి 27**

వ్యక్తి అదృశ్యం

రాజశేఖర్(ఫైల్)

శంషాబాద్ రూరల్, మార్చి 27: వ్యక్తి అదృశ్యమైన ఘటన బుధవారం శంషాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెద్దషాపూర్ తండాకు చెందిన సభావత్ రాజశేఖర్(27)గత కొంత కాలం నుంచి పని చేయకుండా ప్రతిరోజు మద్యం సేవిస్తున్నాడు. ఈనెల 18న మధ్యాహ్నం అతిగా మద్యం సేవించి ఇంటికి వచ్చి తాళం వేసుకొని పడుకున్నాడు. దీంతో తల్లి లక్ష్మి మందలించడంతో అతడు ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి కనిపించలేదు. బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిదర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పోలీస్‌స్టేషన్ ముందు హోంగార్డు బైక్ చోరీ

వెంగళరావునగర్, మార్చి 27: ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ముందు పార్కింగ్ చేసిన హోంగార్డు ద్విచక్ర వాహనాన్ని ఓ గుర్తు తెలియని వ్యక్తి దొంగిలించాడు. ఎస్ఆర్‌నగర్ పోలీసుల కథనం ప్రకారం.. జీడిమెట్ల చెరుకుపల్లి కాలనీకి చెందిన బురుజుల మాహుసుబాని(36) ఎస్ఆర్‌నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా పని చేస్తున్నాడు. ఈనెల 24వ తేదీ ఉదయం 9:30 గంటలకు డ్యూటీకి వచ్చి ఎస్ఆర్‌నగర్ ట్రాఫిక్ పో లీస్ స్టేషన్ ముందు తన ద్విచక్ర వాహనాన్ని పార్కింగ్ చేశాడు. డ్యూటీ పూర్తకయ్యాక అదే రోజు రాత్రి 9 గంటలకు బైక్ కనిపించలేదు. చోరీకు గురైందని గ్రహించిన బాధితుడు ఎస్ఆర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ అధికారుల పంజా

- సర్కారు భూములను కబ్జా చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం
- గండిపేట తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి

వట్టినాగులపల్లిలో జేసీబీతో అక్రమ నిర్మాణాలను కూల్చివేయిస్తున్న అధికారులు

మణికొండ, మార్చి 27: ప్రభుత్వ స్థలాలను అక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని గండిపేట తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని పుప్పాలగూడ గ్రామ సర్వే నం.290లో ప్రభుత్వ భూమిలో అక్రమంగా వెలిసిన నాలుగు నిర్మాణాలను రెవెన్యూ సిబ్బందితో కలిసి ఆయన కూల్చివేశారు. విలువైన సర్కార్ భూముల్లో కొంత మంది రాజకీయ నాయకుల అండ దండలను చూసుకొని అక్రమార్కులు గత కొన్ని రోజులుగా గండిపేట మండలంలో రెచ్చిపోతున్నారన్నారు. పుప్పాలగూడ గ్రామ పరిధిలోని సర్వే నం. 290లో గత కొన్నేళ్లుగా కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలను బుధవారం పరిశీలించి కూల్చివేశారు. అక్రమాలకు పాల్పడుతున్న వ్యక్తులను గతంలో రెవెన్యూ కార్యాలయానికి పిలిచి వివరాలు తెలిపినా బేఖాతరు చేస్తూ రాత్రికి రాత్రి అక్రమ నిర్మాణాలను నిర్మిస్తున్నారన్నారు. ఇలాంటి వారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించే ప్రసక్తి లేదని ఆయన హెచ్చరించారు. అదే విధంగా మండల పరిధిలోని బండ్లగూడ, కిస్మత్‌పూర్, హైదర్షాకోట్, నార్సింగి, వట్టినాగుల పల్లి, ఖానాపూర్ తదితర గ్రామాల్లో అక్రమంగా నిర్మిస్తున్న నిర్మాణాలను గుర్తించి తక్షణమే కూల్చివేస్తామని తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ నిర్మాణాల కూల్చివేతలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు సురేశ్, విక్రంరెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

భవనం పైనుంచిపడి వ్యక్తి మృతి

ఖైరతాబాద్, మార్చి 27 : అపార్టుమెంట్‌లో పనిచేస్తుండగా, ప్రమాదవశాత్తు కిందపడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన పంజాగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...ఖైరతాబాద్‌లోని గాంధీనగర్‌లో నివాసం ఉండే రాజు (35) భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తున్నాడు. పనిలో భాగంగా అమీర్‌పేట ఎల్లారెడ్డిగూడలోని తిరుమల అపార్ట్‌మెంట్స్‌లోని ఎనిమిద అంతస్తులో పనిచేస్తుండగా, ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడిపోయాడు. తోటి కార్మికులు దవాఖానకు తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పోక్సో కేసు నమోదు

బంజారాహిల్స్, మార్చి 27: మద్యం మత్తులో కన్నకూతురి పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఓ వ్యక్తిని ఫిలింనగర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలోకి వెళ్తే.. ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ బస్తీలో నివాసం ఉంటున్న వ్యక్తి(39) గత కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. భార్య దగ్గర డబ్బులు తీసుకొని నిత్యం మద్యం తాగుతూ తిరుగుతున్నాడు. కాగా, రెండ్రోజుల కిందట మద్యంమత్తులో స్కూల్ నుంచి వచ్చిన కుమార్తె(7)ను దగ్గరకు పిలిచి అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాలిక అక్కడి నుంచి తప్పించుకొని తల్లి కి చెప్పగా, ఆమె ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చే సి బుధవారం రిమాండ్‌కు తరలించారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

చండీ హోమంలో పాల్గొన్న భక్తులు

బంజారాహిల్స్, మార్చి 27: జూబ్లీహిల్స్ డివిజన్ ఇందిరానగర్‌లో తాగునీటి సమస్యలపై ఫిర్యాదులు అందుకున్న కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్ బుధవారం పర్యటించారు. బస్తీలో నాలుగురోజులకు ఒకసారి తాగునీరు వదులుతున్నారని, సమయాపాలన పాటించడంలేదని బస్తీవాసులు కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన కార్పొరేటర్ జలమండలి జీఎం హరిశంకర్‌కు ఫోన్ చేసి సమస్యలను వివరించారు. దీంతో తట్టిఖానా సెక్షన్ జలమండలి మేనేజర్ రాంబాబును ఇందిరానగర్‌కు పంపించి సమస్యలను పరిష్కరించాల్సిందిగా జీఎం ఆదేశించారు. కార్యక్రమంలో నాయకులు పెరుక కిరణ్‌కుమార్, దీపక్. జ్యోతి, వినయ్, వికీ్క మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరానగర్‌లో తాగునీటి సమస్యపై జలమండలి అధికారులకు వివరిస్తున్న కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్

ఘనంగా పోచమ్మ దేవాలయ వార్షికోత్సవం

మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 27: దేవాలయాల్లో మానసిక ప్రశాంతత లభిస్తుందని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ మాజీ కార్పొరేటర్ టి.ప్రేమ్‌దాస్‌గౌడ్ అన్నారు. డివిజన్ పరిధిలోని పద్మశాలిపురం పోచమ్మ దేవాలయం 6వ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. దేవాలయంలో అభిషేకం, చండీహోమం తదితర పూజలు నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ టి.ప్రేమ్‌దాస్‌గౌడ్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కాశీగారి యాదగిరితో కలిసి దేవాలయంలో పూజలు నిర్వహించారు. వార్షికోత్సవం సందర్భంగా దేవాలయ కమిటీ నిర్వాహకులు దేవాలయాన్ని వివిధ రకాల పూలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. భజన మండలి ఆధ్వర్యంలో భక్తి గీతాలాపన నిర్వహించారు. పద్మశాలిపురంతో పాట